యువ ఓటర్లే విజయంలో కీలకం

వీరిని ప్రసన్నం చేసుకుంటే గెలుపు ఖాయం



జిల్లాలో మొత్తం ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడింట ఒక వంతు యువతీ, యువకుల ఓట్లే కీలకం కానున్నాయి. వీరు ఏ అభ్యర్థి వైపు మొగ్గు చూపితే వారే అసెంబ్లీలో అడుగు పెడతారని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ప్రతి నియోజకవర్గంలో వీరి ఓట్లు 30వేల నుంచి 50 వేల వరకు ఉండడంతో విజేతపై వీరి ప్రభావం ఉంటుందని అంచనా వేస్తున్నారు. అంటే వీరి మద్దతు పొందిన పార్టీ విజయఢంకా మోగిస్తుందన్నమాట. ఈ కారణంగానే పోటీలో అభ్యర్థులు యువ ఓటర్లను వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తమ వైపు తిప్పుకునేందుకు ఎవరికి వారు ప్రణాళికలు వేసుకుంటున్నారు. ఈసారి ఈ వర్గం ఓట్లు ఏ పార్టీకి మద్దతు పలికే అవకాశం ఉందనేది ఆసక్తికరంగా మారింది.

జంగ్ తెలంగాణ

సుజాతనగర్: సమాజంలో మార్పు తీసుకొచ్చి జాతి భవిష్యత్‌ను మార్చగల సత్తా కేవలం 'ఓటు'కే ఉంది. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటుహక్కును స్వచ్ఛందంగా వినియోగించుకుంటామని పలువురు యువతీ యువకులు పేర్కొంటున్నారు. ఎన్నికల్లో గెలుపోటములను ప్రభావితం చేసేది యువ ఓటర్లే కావడం విశేషం. పోటీ చేసే అభ్యర్థుల్లో సమర్థులనే గెలిపిస్తామని వారంటున్నారు. నోటును కాదు నేతను చూద్దాం.. నిజాయితీని గెలిపిద్దాం.. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెబుతున్నారు. ఎన్నికల్లో నిలబడిన అభ్యర్థులు నచ్చకపోతే తిరస్కరణ ఓటు వేసే అవకాశం ఎన్నికల సంఘం ఓటర్లకు కల్పించింది. అంతేకాకుండా అర్హులైనవారు కొత్త ఓటర్లుగా నమోదయ్యేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేయడానికి జాబితాలో పేర్లు లేని, 18 సంవత్సరాలు నిండిన వారు ఓటర్లుగా నమోదు చేయించుకోవడానికి అవకాశం కల్పించామని ఎన్నికల అధికారులు తెలిపారు. ఇందు కోసం ఈనెల 31వ తేదీ వరకు ఎన్నికల సంఘం గడువు ఇచ్చిందని, అర్హులైన ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో అభ్యర్థుల గుర్తుతో పాటు, నోటా (నన్ ఆఫ్ ది ఎబౌవ్) కూడా ఉంటుంది. దీనిపై పలువురి అభిప్రాయాలు..

జిల్లాలోని ఐదు నియోజకవర్గాలలో యువ ఓటర్లు ఇలా...

నియోజకవర్గం	యువ ఓటర్లు
కొత్తగూడెం	50,241
ఇల్లెందు	46,031
అశ్వారావుపేట	33,516
పినపాక	43,034
భద్రాచలం	27,216

ఓటు హక్కు పొందేందుకు ఎలక్షన్ కమిషన్ ఈ నెల చివరి వరకు అవకాశం కల్పించినందున ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశముంది.

సుస్థిర పాలన అందించే పార్టీకే..



రాష్ట్రంలో సుస్థిర పాలన అందించడమే గాకుండా యువతకు ఉద్యోగావకాశాలు, ఉపాధి అవకాశాలు కల్పించి ప్రణాళిక బద్ధంగా పాలించే పార్టీకే ఓటు వేయడానికి ప్రాధాన్యం ఇస్తా. ఈ విషయమై నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యాక అభ్యర్థులందరినీ పరిశీలించి వారిలో మంచి వారిని గుర్తిస్తాను. – గంగపూరి జ్ఞానదీప్, హరిజనవాడ

స్వార్థపరులకు ఓటు వేయను



ప్రజలతో ఎన్నికైన వారు సొంత ప్రయోజనాలను పక్కన పెట్టాలి. ప్రజలచేత ఎన్నికైన నాయకులు ప్రజలకు అన్నివేళల్లో అందుబాటులో ఉండాలి. మెజార్టీ ప్రజా సమస్యలను నాయకుడు పట్టించుకోవాలి. స్వార్థం లేని నాయకులను గుర్తించి వారికే నా ఓటు వేస్తాను.
– కొల్లూరి లావణ్య, సుజాతనగర్

భవిష్యత్ భరోసాకే నా ఓటు



భవిష్యత్‌కు భరోసా కల్పించే నాయకుడికే ఓటు వేస్తాను. ఉపాధి అవకాశాలు కల్పించే నాయకుడికే ప్రాధాన్యం ఇస్తా. విద్యావంతులతో పాటు ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటు వేయాలి. అన్ని రంగాల్లో మార్పు రావాలి. అది యువతతోనే సాధ్యమవుతుంది. న్యూస్ పేపర్లో చూసి ఓటుహక్కు కోసం దరఖాస్తు చేశాను. – కోపెల వెన్నెల, సుజాతనగర్

ఇవే చివరి ఎన్నికలు.. ఆదరించండి..



రుద్రంపూర్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

చుంచుపల్లి/సింగరేణి(కొత్తగూడెం): రాజకీయంగా అండగా నిలుస్తూ ఎమ్మెల్యే, మంత్రిగా కొత్తగూడెం నియోజకవర్గానికి దశాబ్దాలుగా సేవ చేసే భాగ్యం కల్పించిన ప్రజల రుణం తీర్చుకోలేనిదని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం చుంచుపల్లి మండలంలోని రుద్రంపూర్, ధన్‌బాద్, గౌతంపూర్ ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. కొత్తగూడెం నియోజకవర్గం తనకు తల్లి లాంటిదని, ఏళ్ల తరబడి ప్రజలు తనకు వెన్నంటి ఉంటున్నారని చెప్పారు. వారి అండతోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ప్రజా సంక్షేమం, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 40 ఏళ్లుగా రాజకీయంలో ముందుకెళ్తున్నానని పేర్కొన్నారు. ప్రతి ఎన్నికల సమయంలో మేమున్నామంటూ ప్రజలు అండగా నిలుస్తూ అసెంబ్లీకి పంపిస్తున్నారని, మరోసారి తన గెలుపుకు భరోసా ఇస్తూ ప్రోత్సహించాలని చెప్పారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెబుతూ కొందరు ప్రచారానికి వస్తారని అలాంటి వారి మాటలను నమ్మొద్దన్నారు. తన రాజకీయ జీవితంలో కేసీఆర్ దీవెనలతో చివరిసారి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచానని ప్రజలు ఆదరించి గెలిపించాలని కోరారు. సింగరేణి కార్మికులకు అండగా ఉండటమే కాకుండా కార్మిక ప్రాంతాలను అభివృద్ధి చేసింది ఒక్క బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు. కార్యక్రమంలో కంచర్ల చంద్రశేఖరరావు, వనమా రాఘవేందర్‌రావు, బాదావత్ శాంతి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

మార్పు దిశగా అడుగులు వేయాలి



ప్రచారం నిర్వహిస్తున్న బీఎస్పీ నాయకులు

పాల్వంచరూరల్: కొత్తగూడెం అభివృద్ధి కోసం ఓటర్లు మార్పుదిశగా అడుగులు వేయాలని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి యెర్రా కామేష్ పేర్కొన్నారు. మన కొత్తగూడెం–మన కామేష్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన మండల పరిధిలోని కొత్త సూరారం, పాత సూరారం, రెడ్డిగూడెం, పాండురంగాపురం, తవిసెలగూడెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సామిల్లులో పనిచేస్తున్న, భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికుల వద్దకు వెళ్లి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఓటు నమోదు చేయించుకున్న యువత నిర్ణయాత్మక శక్తిగా మారబోతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కోళ్లపూడి ప్రవీణ్ కుమార్, కెతిని కుమారి, కోలా మల్లిక, యర్రంశెట్టి రాజేశ్వరి, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించండి



మాట్లాడుతున్న ఉమర్

జూలూరుపాడు: రైతులు పండించిన వరి, పత్తి పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర నాయకుడు ఎస్కే ఉమర్ డిమాండ్ చేశారు. ఆదివారం గుండెపుడి గ్రామంలో జరిగిన ఏఐకేఎంఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు కనీస మద్దతు ధర లేక నష్టపోతున్నట్లు చెప్పారు. పత్తి క్వింటాల్ ఒక్కంటికి రూ.15000, వరి రూ.2500 ధర కల్పిస్తే రైతులు అప్పుల ఊబి నుంచి బయటపడతారన్నారు. ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగాయని, వాటికి అనుగుణంగా పంటలకు ధర పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వల్లోజి రమేష్, జాటోత్ నరసింహారావు, బోడా సుందర్, జమలయ్య, కిషన్, రాజేష్, భీమా, లక్ష్మా, బుచ్చమ్మ, భూక్యా వీరి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సదస్సుకు హాజరుకండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు

పాల్వంచ: నవంబర్ 1న ఖమ్మం ట్యాంక్ బండ్‌లోని ఒయాసిస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కన్వీనర్ మంజూరు, ఉద్యమకారులు గోపగాని శంకర్‌రావు, మల్లెల రామనాథం పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. అన్నివర్గాల భాగస్వామ్యంతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు కోరుకున్న విధంగా పాలన సాగడం లేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో సర్వస్వం కోల్పోయి ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల కుటుంబాలను, ఉద్యమమే జీవితంగా భావించి పోరాడిన వారిని విస్మరించారన్నారు. వారికి కనీస గౌరవం కూడా ఇవ్వకుండా అన్యాయం చేసారని వాపోయారు. కేసీఆర్‌ను నమ్ముకుని ఉద్యమాలు చేసిన వారు నేడు రోడ్డున పడ్డారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను అధికారంలోకి రానివ్వమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు గౌరవాన్ని ఇస్తామని, 250 గజాల ఇంటి స్థలం కేటాయిస్తామని మేనిఫెస్టోలో ఆరు గ్యారెంటీలు ప్రకటించడం జరిగిందన్నారు. కాబట్టి ఉద్యమకారులకు పెద్దపీట వేసే పార్టీకే మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో కనగాల అనంతరాములు, శ్రీపాద సత్యనారాయణ, బుడగం నాగేశ్వరరావు, బొల్లం భాస్కర్, ముస్తాఫా, ఎండీ మౌలానా, ఇజ్జగాని రవిగౌడ్, తాళ్లూరి సత్యనారాయణ, కేసుపాక ముత్తయ్య, మురళీ కృష్ణ, హుస్సేన్‌సురేశ్ నాయక్, మౌలాలీ తదితరులు పాల్గొన్నారు.

ఓసీలో డైరెక్టర్ పర్యటన



ఓసీని సందర్శించి పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

ఇల్లెందు: సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్టు ప్లానింగ్ జి.వెంకటేశ్వరరెడ్డి ఆదివారం జేకే ఓసీలో పర్యటించారు. ఓసీ స్థలాలను, అక్కడి పనులను పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ, బ్లాస్టింగ్, లోడింగ్ పనులను పరిశీలించారు. ఓసీ వివరాలను స్థానిక జీఎం జాన్ ఆనంద్‌ను అడిగి తెలుసుకున్నారు. బొగ్గు ఉత్పత్తిలో అవరోధాలు ఎదురవ్వకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఏరియాకు కేటాయించిన వార్షిక లక్ష్యాన్ని అధికారులు, ఉద్యోగులు సాధించాలని కోరారు. మ్యాన్ పవర్, యాంత్రిక శక్తిని పూర్తిస్థాయిలో వినియోగించాలని ప్రతీరోజు ఉత్పత్తి అయిన బొగ్గు రవాణా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట ఏరియా జీఎం జాన్ ఆనంద్, ప్రాజెక్టు ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు, సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, ఇంజనీర్ చిన్నయ్య, సర్వే అధికారి నాగేశ్వరరావు, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



1993-94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

సుజాతనగర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94లో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆ పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. 29 ఏళ్ల తరువాత చిన్ననాటి స్నేహితులు ఒకేచోట కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. బావున్నావా.. ఏం చేస్తున్నావురా... అంటూ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ తన్మయత్వం చెందారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం నాటి గురువులు కేశిరెడ్డి, అనిల్ కుమార్, నాగేశ్వరరావు, నాగేశ్వరీలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్ వీరభద్రరావు, విద్యా కమిటీ చైర్మన్ కోమారి కృష్ణ, పూర్వ విద్యార్థులు బాబూలాల్, చింతలపూడి సతీష్, బన్సీలాల్, భాస్కర్‌రావు, గంగాప్రసాద్, గద్దం సురేందర్, మూడు కాంతారావు, సీకా కృష్ణవేణి, పద్మ, ధనలక్ష్మి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అన్నివర్గాలకూ మేలు



పాల్వంచ: ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



ఇల్లెందు: మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పాల్వంచ: ఎక్కువ జనాభా కలిగిన తెలంగాణ రాష్ట్రంలో బీసీని ముఖ్యమంత్రిని చేస్తానని హామీ ఇచ్చిన బీజేపీని వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి చింతలచెర్వు శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పాల్వంచలో బీజేపీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని పెద్దమ్మగుడి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం బసవతారాక కాలనీలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేపట్టారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ... కేసీఆర్ నియంతృత్వ విధానాల వల్ల తెలంగాణ రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మానుపురి ప్రభాకర్, రాపాక రమేశ్, భీమాల్ కుమార్, వలపు మురళీ యాదవ్, తాటికొండ కల్యాణ్, తోకల నర్సుదాస్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: తెలంగాణకు బీసీ సీఎంను నియమిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించటం శుభపరిణామమని, తెలంగాణలో అత్యధికంగా ఉన్న బీసీలు ఆ వైపుకు ఆలోచన చేయాలని బీజేపీ ఇల్లెందు అసెంబ్లీ అభ్యర్థి డి.రవీంద్ర నాయక్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని సీఎం పీఠం ఎక్కిస్తామని ప్రకటించటాన్ని హర్షిస్తూ మోదత చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం పదేళ్ల కాలంలో మోదీ సర్కార్ ప్రవేశపెట్టి అమలు చేసిన పథకాలు, ప్రపంచ దేశాల సరసన భారత్‌ను అగ్రస్థానంలో నిలిపిన విషయాన్ని గుర్తు చేశారు. గడిచిన ఐదేళ్లల్లో మోదీ అనేక సాహసోపేతమైన విధాన నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. 18 బీసీ కులాలకు విశ్వకర్మ యోజనా పథకం ద్వారా లబ్ధి అందించారని తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో అన్నివర్గాల అభ్యున్నతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాళ్ల సోమసుందర్, బలగానీ గోపీకృష్ణ, రుక్మారావు, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ముస్కు శ్రీనివాసరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, విమల్ జైన్, యశ్వంత్ ఠాగూర్, రామారావు నాయక్, బాలాజీ నాయక్, రామచంద్రనాయక్, మురళీ కృష్ణ, నాగరాజు, ఈసం వెంకటేశ్వర్లు రామిరెడ్డి, వెంకటేశ్వరరావు, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భీం ఆశయ సాధనకు ఉద్యమించాలి



జూలూరుపాడులో భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు



టేకులపల్లిలో...

టేకులపల్లి: ఆదివాసీల హక్కుల కోసం పోరాడి అసువులు బాసిన కొమురం భీం ఆశయ సాధన కోసం ఆదవాసీలు ఉద్యమించాలని ఏఈడబ్ల్యూసీఏ నేత మెట్ల పాపయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని కొమురం భీం విగ్రహం వద్ద 83వ వర్ధంతి నిర్వహించారు. భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా జల్ జంగిల్ జమీన్ పేద ప్రజలకు దూరమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాం నవాబులపై గర్జించి దేశ స్వాతంత్ర్యంలో ప్రముఖ పాత్ర పోషించిన ఆదివాసీ ముద్దుబిడ్డ కొమురం భీముని సేవలను కొనియాడారు. ఆయన పోరాటం ద్వారానే బ్రిటిష్ వారు కమిషన్ ఏర్పాటు చేశారని దాని ద్వారానే ఈరోజు ఆదివాసీ ముద్దుబిడ్డలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, ఉద్యోగాలు అనుభవిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కల్తి సత్యనారాయణ, బుగ్గ రామనాథం, లక్ష్మీనారాయణ, రాం బ్రహ్మం పాల్గొన్నారు.

జూలూరుపాడు: కొమురం భీం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జూలూరుపాడులో మన్యం వీరుడు, ఆదివాసీ ఆరాధ్యదైవం, గోండు బెబ్బులి కొమురం భీం వర్ధంతి నిర్వహించారు. పాపకొల్లు క్రాస్ రోడ్ వద్ద భీం విగ్రహానికి సంఘం జిల్లా నాయకులు తెల్లం నరసింహారావు దొర, కొమరం భీం ఫౌండేషన్ కమిటీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. ఆదివాసీ విప్లవ నాయకుడు కొమరం భీం అని కొనియాడారు. ఆయన ఆశయాల సాధన కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సోడె శ్రీరామ్, బచ్చల లక్ష్మయ్య, కొడెం సీతాకుమారి, బూరం రమేష్, తెల్లం మహేష్, వాకదాని వీరభద్రరావు, ఊకే వీరభద్రం, బొర్రా సంజీవ్, లెనిన్, గోపాల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి విజిలెన్స్ వారోత్సవాలు



మాట్లాడుతున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు: ఈ నెల 30 నుంచి నవంబర్ 5 వరకు సింగరేణిలో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. ఆదివారం తన చాంబర్‌లో మాట్లాడుతూ... అవినీతి రహిత నవభారత దేశ నిర్మాణంలో భాగంగా సింగరేణిలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వాతంత్ర్య దేశంలో నిజాయితీతో స్వావలంబన వెళ్తోందనే నినాదంతో సింగరేణి ముందుకు సాగుతుందని తెలిపారు. సింగరేణిలో అవినీతిని అరికట్టే విధానంలో భాగంగా నగదు రహిత విధానం, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రిక్రూట్‌మెంట్, కొనుగోళ్లు, బొగ్గు రవాణా, కాంట్రాక్టులలో అవకతకలు జరుగకుండా పారదర్శకంగా జరిగేందుకు సంబంధిత విభాగాలతో కలిసి పని చేసి సంస్థాగత కార్యకలాపాల సక్రమణ నిర్వహణకు సంస్థ సహకరిస్తుందని తెలిపారు.

అమరుల స్తూపాలు, బొడ్రాయికి పోస్టర్లు



బొడ్రాయికి అంటించిన పోస్టర్

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు విప్లవ పార్టీలకు చెందిన అమరవీరుల స్తూపాలు, గ్రామ దేవత అయిన నాభిశిలకు బీఆర్ఎస్ పార్టీ ప్రచార పోస్టర్లను అటించారు. దీంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం పోస్టర్లను తొలగించాలని, లేనిపక్షంలో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని గ్రామంలోని యువకులు హెచ్చరించారు.

వైద్యశిబిరానికి స్పందన

సింగరేణి(కొత్తగూడెం): నైటింగేల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం కార్మిక ప్రాంతమైన రామవరం 7వ వార్డులో షణ్ముఖ ఆర్థో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఎండీ డాక్టర్ ప్రవీణ్ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన పేషంట్లకు ఎంఎస్ ఆర్థోపెడిక్, స్టాఫ్ నర్స్ దైవకుమారి సహకారంతో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరానికి వచ్చిన ఒక నిరుపేద మహిళకు అవసరమైన ఆపరేషన్ ఖర్చును తానే భరిస్తానని భరోసా ఇచ్చారు. నైటింగేల్ చారిటబుల్ ట్రస్ట్ ఎండీ అభినయ పోలెపాక, ప్రాజెక్ట్ మేనేజర్ ఎల్‌జే ప్రవీణ్‌కుమార్, ట్రెజరర్ బి.సాయికృష్ణ, వలెంటీర్లు ఎల్.ఇవాన్ ప్రఖ్యాత్, ఎల్ జాషువ ప్రశస్థ్, చాంద్‌పాషా, షేక్ ఇమ్రాన్, పి.నాగరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: బీఆర్ఎస్ పార్టీకి మరింత ఆదరణ పెరుగుతోందని ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ అన్నారు. ఈ మేరకు ఆదివారం బొమ్మనపల్లి గ్రామంలో మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి బొమ్మనపల్లి పంచాయతీకి చెందిన పలువురు యువకులు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తాగునీటికి నోచుకోని సాయన్నపేట



అలంకార ప్రాయంగా మంచినీటి ట్యాంక్

టేకులపల్లి: ప్రజలకు సురక్షితమైన తాగు నీరు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టి గోదావరి జలాలను శుద్ధి చేసి ఇంటింటికీ అందిస్తున్న విషయం తెలిసిందే. టేకులపల్లి మండలం తొమ్మిదోమైలు తండా పంచాయతీ సాయన్నపేట గ్రామస్తులు మాత్రం మిషన్ భగీరథ నీటికి నోచుకోవడం లేదు. సుమారు నాలుగేళ్ల క్రితం ఈ గ్రామానికి భగీరథ పైపులైన్లు వేశారు. ఓ ట్యాంకర్ ఏర్పాటు చేశారు. ప్రారంభంలో రెండు మూడు నెలలు ట్యాంక్‌లో నీటిని నింపి ఇంటింటికీ సరఫరా చేశారు. ఆ తరువాత నుంచి ట్యాంకులోకి భగీరథ నీరు రావడం లేదు. దీంతో గ్రామస్తులకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. అన్ని అవకాశాలు ఉన్నప్పటికీ మిషన్ భగీరథ నీరు సరఫరా లేకపోవడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సాయన్నపేట గ్రామానికి భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

సాగునీటి సరఫరాకు ఆటంకం



చెత్త తొలగిస్తున్న స్థానిక రైతులు

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో సుమారు 3 వేల ఎకరాల పంట భూములకు సాగు నీరు అందించే రోళ్లపాడు ప్రాజెక్టు తూము చెత్తచెదారంతో నిండిపోయింది. కర్రలు, చెత్త, ప్లాస్టిక్ వస్తువులు తూము వద్ద నిల్వ ఉండటంతో పంట పొలాలకు వెళ్లే కాలువలకు సాగు నీటి సరఫరాలో ఆటంకం ఏర్పడింది. నెలల తరబడి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడి రైతులు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత శాఖాధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. పంట పొలాలకు సాగునీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక యువకులు, రైతులు కొందరు సాహసం చేసి తూములో దిగి చెత్తను తొలగించేందుకు ప్రయత్నం చేసినా కుదరలేదు. పెద్దపెద్ద కర్ర ముక్కలు, మొద్దులు, చెత్తచెదారంతో కాలువకు అడ్డంగా కూరుకుపోయినట్లు స్థానికులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి తూములో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

భిక్షం మృతదేహానికి నివాళి



ఆర్థిక సాయం అందిస్తున్న హరికృష్ణ

ఇల్లెందు: పట్టణంలోని 16వ వార్డుకు చెందిన సుతారీ మేస్త్రీ భిక్షం అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సీఐటీయూ నేతలు శంకర్, కటకం రాజయ్య, సుల్తానా, సత్యనారాయణ, యాదమ్మ, సరిత, టీఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మేకల శ్యాం, కౌన్సిలర్ గిన్నారపు రజిత, పెండ్యాల హరికృష్ణ, సామల రవితేజ, శ్రీనివాస్, రాజశేఖర్, మహేష్, సంజీవరావు, రాము తదితరులు ఉన్నారు. అంత్యక్రియల ఖర్చుల కోసం పెండ్యాల హరికృష్ణ రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు.